క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సచివాలయ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: ఎన్నికల సమయం దగ్గర పడడంతో ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. గురువారం మండలంలోని బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, పలుకుదొడ్డి, తిమ్మందొడ్డి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామ సచివాలయాలు, పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సచివాలయాలు, పోలింగ్ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన వసతులు, సౌకర్యాలను పూర్తి స్థాయిలో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బూజునూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

గడివేముల: మండల పరిధిలోని బూజునూరు చెక్‌పోస్టు వద్ద వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాత్రి వేళల్లోనూ తనిఖీలు సాగుతున్నాయి. నగదు, మద్యం తరలించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతి వాహనాన్ని వీడియో కవరేజ్ చేయడంతో పాటు రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం



కంబదహాల్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. కంబదహాల్ గ్రామంలో ఎంపీటీసీ సభ్యురాలు శోభారాణి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, రామాంజనేయులు, సత్యరెడ్డి, జయరామిరెడ్డి, రాముడు, రాజు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్‌ను గెలుపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే గుండ్రేవుల గ్రామంలో శ్రీనివాసులు రెడ్డి, బ్రాహ్మణదొడ్డిలో సర్పంచ్ దస్తగిరి ఆధ్వర్యంలో ప్రతి గడపకు వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



పర్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు ఇంటింటి ప్రచారం చేశారు. చిన్నటేకూరులో పార్టీ మండల కన్వీనర్ పెద్ద ఈశ్వరయ్య, సల్కాపురంలో సర్పంచ్ మద్దిలేటి, ఎ.గోకులపాడులో సర్పంచ్ గిడ్డమ్మ, మధుసూదన్‌రెడ్డి, పర్ల గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు అశోక్ వర్ధన్‌రెడ్డి, సర్పంచ్ హనుమక్క, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకన్న, మద్దిలేటి ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించుకుంటే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని నాయకులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు చర్యలు



చీకటిలో విధులు నిర్వహిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్) : పాణ్యం నియోజకవర్గంలోని 357 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సెక్టార్, ఏఈఆర్ఓలను ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆమె ఆరు గంటలకు పాణ్యం ఫెసిలిటేషన్ సెంటర్ బీ క్యాంపు లోని బాయ్స్ ఉన్నత పాఠశాలల నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో కరెంట్ పోయింది. అయినా, ఆమె తన టెలికాన్ఫరెన్స్‌ను చీకటి నుంచే కొనసాగించారు. కాగా, పోలింగ్ ముందు రోజున ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా భోజనాలు, వాహనాల పార్కింగ్‌కు చర్యలు తీసుకోవాలని సూచించారు.

టీడీపీ మోసపూరిత హామీలను నమ్మొద్దు



ప్రజలకు అభివాదం చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న టీడీపీని నమ్మి మోసపోవద్దని కాటసాని సూచించారు. 2014 ఎన్నికల సమయంలో రైతులు, పొదుపు మహిళల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక విస్మరించిన విషయం మరిచిపోవద్దన్నారు. అలాగే బ్యాంకుల్లో తాకట్టుపెట్టిన బంగారు నగలను ఇంటికి తెప్పిస్తానని మాయమాటలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మాయమాటలు చెప్పి ఓట్లను దండుకోవడమే తప్పా ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడం చంద్రబాబు నైజమన్నారు. మన ప్రభుత్వంలో ప్రజకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసినట్లు తెలిపారు. ప్రజలు గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించి మంచి చేసిన ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం



నన్నూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

రాష్ట్రంలో మరోసారి ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తుందని కాటసాని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాన్ని గెలిపిస్తారో? ఓట్ల కోసం మోసమాటలు చెప్పే వ్యక్తులకు ఓటేస్తారో మీరే నిశ్చయించుకోవాలని ప్రజలను కోరారు. నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, సర్పంచ్‌లు గంగాధరరెడ్డి, బ్రహ్మయ్య, ఎంపీటీసీ సభ్యులు ఫాతిమాబి, కుసుమలత, నాయకులు పరమేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, వెంకటరామిరెడ్డి, తులసిరెడ్డి, జేసీబీ అంజి, గఫార్‌మియా, పందిపాటి షరీఫ్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

- మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించండి
- నన్నూరులో రూ.75 కోట్లతో అభివృద్ధి పనులు
- టీడీపీ మోసపూరిత హామీలతో కష్టాలు తెచ్చుకోవద్దు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- జోరు వానలోనే ఎన్నికల ప్రచారం



కాటసాని ఎన్నికల ప్రచారానికి తరలివచ్చిన నన్నూరు ప్రజలు

ఓర్వకల్లు: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం మండలంలోని భైరాపురం, నన్నూరు గ్రామాల్లో జోరు వానను సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే ప్రజలకు మరింత మేలు చేస్తారని తెలిపారు. సంక్షేమ పథకాలను కొనసాగించడమే కాకుండా పథకాల లబ్ధిని పెంచుతారన్నారు. చేయూత పథకం రూ.75 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు పెంచుతారని చెప్పారు. ఐదేళ్ల పాలనలో ఒక్క నన్నూరు గ్రామంలోనే రూ.75 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. గ్రామంలో నిర్మించిన పురాతన వంతెనను సుమారు రూ.2 కోట్లతో పునఃనిర్మించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందజేశామని, సుమారు 1,500 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

- రేమట నుంచి టీడీపీకి చెందిన 50 కుటుంబాలు
- మెరుగుదొడ్డి నుంచి 50 కుటుంబాలు
- గూడూరు నుంచి 500 మంది చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కోట్ల హర్ష



మెరుగుదొడ్డి గ్రామం నుంచి పార్టీలో చేరిన వారితో ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీకి కోలుకోలేని దెబ్బలు తగులుతున్నాయి. గురువారం పలు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, వివిధ సంఘాల సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

→ కర్నూలు రూరల్ మండలం రేమట గ్రామంలో టీడీపీలోని బోయ సామాజికవర్గానికి చెందిన 50 కుటుంబాలు జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, తిరుమలరెడ్డి, శివ శంకర్ నాయుడు, సంపత్‌కుమార్, బోయ సురేష్, బోయ హనుమంతు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరిలో మహేష్, తిరుమల, సుధాకర్, రామాంజి, పులికొండ, శ్రీరామ్, మద్దిలేటి, శ్రీను, జయరాం, గోపాల్, కుమార్, శేఖర్, అనిల్ తదితరులు ఉన్నారు.

→ కోడుమూరు మండలం మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన సత్యంరెడ్డి, సూర్య నారాయణ, ప్రసాద్, శివశంకర్, వెంకటేష్ ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలో చేరిన వారిలో రామాంజనేయుడు, బలరాం, నాగేశ్వరరావు, అశోక్, ఏసు, తిమ్మప్ప, నరసింహూడు, వీరన్న తదితరులు ఉన్నారు.

→ గూడూరు పట్టణానికి చెందిన వడ్డెర, బెస్త, ముస్లిం, మాల యువజన సంఘాలకు చెందిన 500 మంది గూడూరు నగర పంచాయతీ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లాం ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరిలో షేక్‌షావలి, ఫాజిల్, మక్బుద్, రహిమాన్, రజాక్, జుబేర్, షేక్‌షావలి, షాకీర్, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, రాఘవులు, రామాంజనేయులు, తెలుగు చంటి, గంగాధర్, లక్ష్మన్న, ఆది, రామాంజనేయులు, బోయ రేగల వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, వీరేష్, గిడ్డయ్య, గిరి తదితరులు ఉన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన రేమట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు



గూడూరుకు చెందిన వివిధ సంఘాల నాయకులు

జగన్‌కు మద్దతుగా నిలవండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఒంటెద్దు బండిపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న మహిళలు

కల్లూరు: రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు అర్బన్‌లోని 37, 41వ వార్డుల పరిధిలోని కాలనీల్లో కార్పొరేటర్లు ఆయిషా సిద్ధిఖా, గాజుల శ్వేతారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా కాలనీ వాసులు కాటసానికి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరుగుతూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, పోచా బ్రహ్మానందరెడ్డిని నంద్యాల ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంచి చేసిన వారికి ఎల్లప్పుడు ప్రజల గుండెల్లో స్థానం ఉంటుందన్నారు. సీఎం జగన్ ఈ ఐదేళ్ల పరిపాలనలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి అనేక అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రస్తుతం అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ జగన్ సీఎంగా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆస్పత్రుల్లో వైద్యపోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయడమే కాక ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలలను నాడు–నేడు పేరుతో అభివృద్ధి చేశారన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పిల్లలను పాఠశాలలకు పంపిస్తున్న ప్రతి తల్లికి ఏడాదికి రూ. 15వేలు అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా మహిళల అభ్యున్నతికి వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలు అమలు చేశామన్నారు. చంద్రబాబు హయాంలో ఇలాంటి ఏ ఒక్క పథకం లేదన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసినా ప్రజలకు చేసిన మేలు శూన్యమన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, 37, 41వ వార్డు నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాన్ని లెక్కచేయని అభిమానం



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, సతీష్, కోట్ల హర్షను సత్కరిస్తున్న కొత్తూరు గ్రామస్తులు

కోడుమూరు రూరల్: ప్రతి గడపకు సంక్షేమ ఫలాలందించిన జగనన్న వెంటే మేమంతా అంటూ కోడుమూరు మండలం కొత్తూరు గ్రామస్తులు గురువారం సాయంత్రం భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై.రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిపై పూల వర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. వారంతా కోడుమూరులో ప్రచార నిమిత్తం వెళుతున్న విషయాన్ని తెలుసుకున్న కొత్తూరు గ్రామస్తులు చిన్నా పెద్దా తేడా లేకుండా వర్షం పడుతున్నా లెక్కచేయకుండా అభిమానాన్ని చాటుకున్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రం పరిశీలన

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు మోడల్ పోలింగ్ (340) కేంద్రాన్ని కర్నూలు అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి గురువారం పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నిక విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ఉన్నారు.



చిల్లబండలో మహిళలతో మాట్లాడుతున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్ష, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- జగనన్నను గెలిపించుకుంటే బంగారు భవిష్యత్తు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కోట్ల హర్ష



ఎర్రదొడ్డిలో ప్రజలకు అభివాదం చేస్తున్న సతీష్

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని, ప్రజలంతా మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. గురువారం కోడుమూరు మండలం చిల్లబండ, ఎర్రదొడ్డి గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పూల వర్షం కురిపిస్తూ అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మీ ఇంటికి మంచి జరిగి ఉంటేనే ఓటేయ్యమని అడిగే దమ్మున్న నేత సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ప్రస్తుతం పేదలకు, పెత్తందారుల మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. ఫ్యానుఎ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని సతీష్ కోరారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్లీసాహెబ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి, దేవేంద్రరెడ్డి, మగ్బుల్‌సాహెబ్, ఇలియాస్, మద్దిలేటి, బాలు, శ్రీను, లక్ష్మన్న, ఈశ్వరయ్య, రామగిడ్డయ్య, దాసు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు

సంక్షేమానికి ఓటేద్దాం



గడివేములలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం



బూజునూరులో..

గడివేముల: వైఎస్సార్‌సీపీ పాలనలో జగనన్న చేపట్టిన ప్రజా సంక్షేమానికి ఓటేద్దామని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. గడివేములలో గురువారం పార్టీ నాయకులు మధుసూదనగుప్తా, వెంకటేశ్వర్లు, సీపీ రమణయ్య, నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, బాలచెన్నిలతో కలిసి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అలాగే గ్రంధివేములలో పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, రఘుమాధవరెడ్డి, బిలకలగూడూరులో పోగుల చంద్రశేఖరరెడ్డి, గనిలో ఆనంద్‌రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పెసరవాయిలో ఎల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గడిగరేవులలో సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. చిందుకూరులో మాజీ సర్పంచ్ వెంకటకృష్ణారెడ్డి, కరిమద్దెలలో పుల్లయ్య, డాలుస్వామి, కొరటమద్దిలో సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, మంచాలకట్టలో అనిల్‌కుమార్‌రెడ్డి, మేఘనాథరెడ్డి ఓట్లు అభ్యర్థించారు.

తారాస్థాయికి చేరిన టీడీపీ విభేదాలు

- కోడుమూరులో డబ్బుల పంపిణీ కోసం ఇరువర్గాల పోటీ
- నేడు కోట్ల, విష్ణు వర్గీయుల సమావేశం

కోడుమూరు: నియోజకవర్గంలో టీడీపీ నేతలు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి వర్గాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసేందుకు నియోజకవర్గానికి రూ.15 కోట్ల చొప్పున కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు డబ్బులు చేరాయని సమాచారం. అయితే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి మధ్య ఉన్న విభేదాల కారణంగా కోడుమూరు నియోజకవర్గంలో డబ్బుల పంపిణీ కార్యక్రమం వాయిదా పడిందట. పంపిణీ వ్యవహారమంతా తనకు అప్పచెబితేనే అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తానని.. లేదంటే ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్ నుంచి తప్పుకుంటానని పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న రామలింగారెడ్డి వద్ద ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి తేల్చిచెప్పినట్లు సమాచారం. కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి సొంత గ్రామమైన లద్దగిరిలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను గెలిపించుకోలేకపోయారని.. కర్నూలు మండలంలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తన వర్గీయులు గెలిచారనే నమ్మకంతోనే తనను నమ్మి అసెంబ్లీ అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరి, ఎంపీగా నాగరాజుకు పోటీ చేసే అవకాశం అధిష్టానం కల్పించిందని పేర్కొన్నట్లు తెలిసింది.

నేడు ఇరువర్గాల సమావేశం

ఓటర్లకు డబ్బుల పంపిణీ చేసే విషయంపై రాజీ కుదిర్చేందుకు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వర్గీయులతో రాజీ కుదిర్చేందుకు టీడీపీ ఇన్‌చార్జ్ రామలింగారెడ్డి కర్నూలులోని ఓ రహస్య ప్రదేశంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. అయితే పెత్తనమంతా తనకు ఇస్తేనే కలిసి పనిచేస్తానని.. లేకుంటే మీరే చేసుకోండని చెప్పి విష్ణువర్ధన్ రెడ్డి ఫోన్ స్విచ్ఆఫ్ చేసినట్లు తెలిసింది.



జలమయమైన కోడుమూరు మునిమందవీధి



గుడిపాడులో రోడ్డుపై కూలిన చెట్టు

కోడుమూరులో వర్ష బీభత్సం

కోడుమూరు రూరల్/గూడూరు రూరల్: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. రోడ్లపై నీరు నిలిచిపోయింది. వీధులు జలమయమయ్యాయి. కొద్ది రోజులుగా తీవ్ర ఎండలు, వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరైన జనం వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు. భారీ వర్షంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ పనులు మొదలు పెట్టుకోవచ్చని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గూడూరు రూరల్ మండల పరిధిలోని కె.నాగలాపురం, పెంచికలపాడు, గుడిపాడు గ్రామాల్లో భారీ ఈదురు గాలులకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కె.నాగలాపురం నుంచి పెంచికలపాడు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న రేకుల షెడ్డు దుకాణాలు నేలమట్టమయ్యాయి. వృక్షాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, తీగలు నేలకొరిగాయి. దీంతో కె.నాగలాపురం నుంచి పెంచికలపాడు వరకు రెండు కిలోమీటర్ల మేరకు గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పెంచికలపాడులో ధ్వంసమైన పోలీసు చెక్‌పోస్టు



రోడ్డుపై షెడ్డు కూలిపోవడంతో ఆగిన వాహనాలు